# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 19 సంచిక: 24 | గురువారం, 25 సెప్టెంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


## బీజేపీ మోసం రాముడికి కూడా అర్థమైంది..

- కరీంనగర్ ప్రజలు మాత్రం..!
- కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు
- తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం
- బీజేపీ మోసం దేవుడు రాముడికి కూడా అర్థమైంది

2



# వారాంతంలోగా స్థానిక నోటిఫికేషన్!

- హైకోర్టు గడువు ముంచుకొస్తుండటంతో సర్కారు నిర్ణయం
- అంతకుముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు జీవో
- ముందు ఎస్ఈసీ షెడ్యూల్.. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్
- రిజర్వేషన్ల ఖరారుకు అర్ధరాత్రి వరకు అధికారుల కసరత్తు
- సీల్డ్ కవర్లలో జిల్లా కలెక్టర్లకు నివేదికలు
- తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారు ఆదేశాలు




2

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో

## 100% బీజేపీ విజయం సాధిస్తుంది

- తెలంగాణలో బీజేపీ స్థిరంగా ఎదుగుతోంది
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 100% బీజేపీ గెలుస్తుంది
- కిషన్ రెడ్డి నేతృత్వంలో విజయం ఖాయం



2

## కాళ్లు కట్టేసి లారీలతో బాదడమేనా.. ప్రజాస్వామ్యమా..?

- నల్గొండలో గిరిజన యువకుడిపై పోలీసుల దమనకాండ
- కాంగ్రెస్ పాలనపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు
- "యూరియా అడగడమే పాపమా?" – హరీశ్ ప్రశ్న
- పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



2


## వారిని నేను ఆహ్వానిస్తున్నా



2

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పని చేసి విజయం సాధించామన్న కవిత
- తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం అందరం కలిసి సాగుదామని పిలుపు
- జాగృతిలో చేరే కొత్తవారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామని హామీ

## బీసీ రిజర్వేషన్ల పై బీఆర్ఎస్ గరం.. గరం..





- బీసీ రిజర్వేషన్ల అంశంలో రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు
- కాంగ్రెస్ విశ్వాసఘాతం చేస్తోంది
- జీవో లేకుండానే కోర్టు కేసులు కాంగ్రెస్ కుట్ర


2

## హైడ్రాకు అదనంగా రూ.69 కోట్లు విడుదల

- జీహెచ్ఎంసీ నుంచి రూ.20 కోట్లు మ్యాచింగ్ గ్రాంట్స్
- పెండింగ్ వేతనాలకు ఊరట.. ఉద్యోగుల సంతోషం
- ఆధునిక పరికరాలతో విపత్తు నిర్వహణ మరింత బలోపేతం




2



2

## ఓటర్ చోరీ ఉద్యమంలో నైతిక విజయం

- పాట్నా CWC సమావేశంలో మహేష్ కుమార్ ప్రసంగం
- ఓటర్ చోరీ ఉద్యమంలో నైతిక విజయం
- తెలంగాణ బీసీ రిజర్వేషన్లలో దేశానికి ఆదర్శం
- రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజా పోరాటం మరియు మద్దతు



## బీజేపీ మోసం రాముడికి కూడా అర్థమైంది..

- **కరీంనగర్ ప్రజలు మాత్రం..!**
- **కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరికలు**
- **తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియా సమావేశం**
- **బీజేపీ మోసం దేవుడు రాముడికి కూడా అర్థమైంది**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:**

కరీంనగర్‌లో ఒక్క బడి తేలేదు అని, కనీసం గుడి కూడా తేలేదని.. అయినా కరీంనగర్ వాసులు బీజేపీకే ఓటు వేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. బీజేపీ మోసం దేవుడు రాముడికి కూడా అర్థం అయిందని, అందుకే అయోధ్యలో బీజేపీని ఓడ గొట్టారని ఎద్దేవా చేశారు. అవసరం లేకున్నా వేసిన జీఎస్టీని తీసేసి పండుగ చేసుకోండి అంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఈరోజు కేటీఆర్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకు చెందిన డాక్టర్ రోహిత్ రెడ్డి, గౌతమ్ రెడ్డిలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

'బీజేపీ ప్రభుత్వం అవసరం లేకున్నా వేసిన జీఎస్టీని తీసేసి పండుగ చేసుకోండి అంటున్నారు. ప్రధాని మోదీ చెప్పినట్లు పదిహేను లక్షలు ఏమయ్యాయి. దేవుని పేరు చెప్పి ఓట్లు వేసుకోవడం ఒక్కటే బీజేపీకి తెలుసు. దేవుని పేరు చెప్పారని కరీంనగర్‌లో కూడా బీజేపీని గెలుపించారు. ఎన్నికలు రాగానే ఆగమాగం అవుతున్నాం. కరీంనగర్‌లో ఒక్క బడి తేలేదు, కనీసం గుడి కూడా తేలేదు. అయినా కరీంనగర్ వాళ్లు బీజేపీకే ఓటు వేస్తున్నారు. బీజేపీ మోసం ఆ దేవుడు రామునికి కూడా అర్థం అయింది. అందుకే అయోధ్యలో బీజేపీని ఓడగొట్టారు. కానీ కరీంనగర్‌లో మాత్రం బీజేపీనే గెలిపిస్తున్నారు' అని కేటీఆర్ అన్నారు.

'కాంగ్రెస్ దొంగ మాటలు హైదరాబాద్ ప్రజలు నమ్మలేదు. కానీ ఊళ్లలో నమ్మి మోసపోయారు. చాలా మంది మా ఎమ్మెల్యే ఓడిపోయినా.. కేసీఆర్ గెలుస్తాడు కదా అనుకున్నారు. అందరూ అలాగే అనుకోవడంతో కేసీఆర్ సీఎం కాలేకపోయారు. బంగారు పళ్లెంలో పెట్టి ఇచ్చిన తెలంగాణను కాంగ్రెస్ ప్రబుత్వాన్ ఆగమాగం చేసింది' అని సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్ మండిపడ్డారు.

## బీసీ రిజర్వేషన్ల పై BRS గరం.. గరం..

- **బీసీ రిజర్వేషన్ల అంశంలో రేవంత్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు**
- **కాంగ్రెస్ విశ్వాసఘాతం చేస్తోంది**
- **జీవో లేకుండానే కోర్టు కేసులు కాంగ్రెస్ కుట్ర.**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:**




తెలంగాణ భవన్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీ రిజర్వేషన్ల విషయంలో తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అంశంలో కాంగ్రెస్ పార్టీ విశ్వాస ఘాతుకానికి పాల్పడుతోందని వారు ఆరోపించారు.

ఈ సమావేశంలో మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీలకు ఉన్న 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు అవకాశాలు ఉన్నప్పటికీ, వాటిని ప్రభుత్వం నీరుగారుస్తోందని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కుల గణన జరగలేదని, బీసీ బిల్లు గురించి మాట్లాడడానికి ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్ళినా దీనిపై మాట్లాడలేదని ఆయన విమర్శించారు. ఒకవేళ తమ మనసు గాయపడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. అలాగే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం జీవో ఇవ్వక ముందే కొందరు కోర్టుకు వెళ్ళడంపై ప్రశ్నించారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేదని, రాష్ట్రంలో బీసీలకు మంత్రి పదవులు కూడా కేటాయించలేదని విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో విఫలమైందని, కేవలం కేసీఆర్ నాయకత్వంలోనే బీఆర్ఎస్ బీసీల తరపున పోరాడుతుందని స్పష్టం చేశారు. అలాగే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 42% జీవో ద్వారా ఎన్నికలు నిర్వహిస్తామని చెబుతూ, గత 22 నెలల్లో ఆ జీవో ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. జీవో ఇవ్వకుండానే కొందరు కోర్టుకు వెళ్ళడం కాంగ్రెస్ కుట్ర అని ఆరోపించారు. అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రేవంత్ ప్రభుత్వం "బీసీ రిజర్వేషన్లు అనే పులిపై స్వారీ చేస్తోందని" తాము ముందే చెప్పామని, మాట తప్పితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు.

## కాళ్లు కట్టేసి లాఠీలతో బాదడమేనా.. ప్రజాస్వామ్యమా..?

- **నల్గొండలో గిరిజన యువకుడిపై పోలీసుల దమనకాండ**
- **కాంగ్రెస్ పాలనపై హరీశ్ రావు తీవ్ర విమర్శలు**
- **"యూరియా అడగడమే పాపమా?" – హరీశ్ ప్రశ్న**
- **పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**



నల్గొండ జిల్లాలో జరిగిన ఒక ఘటనను మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. యూరియా కోసం ధర్నా చేసిన ఒక గిరిజన యువకుడిపై పోలీసులు కులం పేరుతో దూషిస్తూ, పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి, కాళ్లు కట్టి లాఠీలతో బాదడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం దమనకాండ సాగిస్తోందని ఆరోపించిన హరీశ్ రావు, యూరియా కావాలంటూ ధర్నాలో పాల్గొనడమే ఆ యువకుడి చేసిన తప్పా అని ప్రశ్నించారు. "రేవంత్ రెడ్డికి అధికారం రావడం అంటే అరాచకానికి అధికారం తోడైనట్లుంది. ప్రశ్నిస్తే దాడులు, నిలదీస్తే కేసులు, అక్రమ అరెస్టులు... ఇంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇవే కనిపిస్తున్నాయి" అని విమర్శించారు. 22 నెలలుగా పాలనను గాలికి వదిలేసి, దౌర్జన్యమే కొనసాగుతోందని ఆయన ఆరోపించారు. లాఠీ దెబ్బలకు నడవలేని స్థితికి చేరుకున్న ఆ యువకుడి భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. థర్డ్ డిగ్రీ విధానాలతో గిరిజన యువకుడిపై కర్కశంగా వ్యవహరించిన పోలీసులపై వెంటనే విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

# వారాంతంలోగా స్థానిక నోటిఫికేషన్!

- **హైకోర్టు గడువు ముంచుకొస్తుండటంతో సర్కారు నిర్ణయం**
- **అంతకుముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు జీవో**
- **ముందు ఎస్ఈసీ షెడ్యూల్.. తర్వాత ఎన్నికల నోటిఫికేషన్**
- **రిజర్వేషన్ల ఖరారుకు అర్ధరాత్రి వరకు అధికారుల కసరత్తు**
- **సీల్డ్ కవర్లలో జిల్లా కలెక్టర్లకు నివేదికలు**
- **తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారు ఆదేశాలు**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:**




స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ఈ వారాంతం లోగా వెలువడే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఈ నెలా ఖరులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఆలోగానే నోటిఫికేషన్ జారీ చేయడం వల్ల ఆ ఆదేశాలను పాటించినట్టు అవుతుందని ప్రభుత్వం భావి స్తున్నట్టు సమాచారం. దీనికిముందే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం జీవో జారీ చేస్తుందని, ఆ వెంటనే ఎన్నికల నిర్వహణ తేదీ ఖరారు చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్ఈసీ) సమాచారం తెలియజేస్తుందనే చర్చ అధికార వర్గాల్లో జరుగుతోంది. ముందుగా ఎస్ఈసీ షెడ్యూల్ జారీ చేస్తుందని, మరుసటిరోజు నోటిఫికేషన్ విడుదల చేయొచ్చునని చెబుతున్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమ శాఖ లేదా ప్రణాళిక శాఖ జీవో జారీ చేసిన తర్వాత, దీని ఆధారంగా పంచాయతీరాజ్ అధికారులు స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై జీవో జారీ చేస్తారని అంటున్నారు.

**రిజర్వేషన్లు బయటకు పొక్కొద్దు..**

మంగళవారం కల్లా ఎంపీటీసీ స్థానాలు, ఎంపీపీ అధ్యక్షులు, జెడ్పీటీసీ స్థానాలు, వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో అర్ధరాత్రి దాకా జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో దీనికి సంబంధించిన కసరత్తు పూర్తిచేసిన అధికారులు, సిబ్బంది.. ఆ మేరకు నివేదికలను సీల్డ్‌కవర్లలో జిల్లా కలెక్టర్లకు అందజేసినట్టు సమాచారం. ఖరారు చేసిన రిజర్వేషన్లను ఎట్టిపరిస్థితుల్లోనూ బయటికి వెల్లడించవద్దని అధికారులకు హెచ్చరికలు జారీ అయ్యాయి. దీంతో వీటిపై వివరాలు చెప్పడానికి పీఆర్ ఆర్‌డీ అధికారులు, సిబ్బంది నిరాకరిస్తున్నారు. కాగా క్షేత్రస్థాయిలో వార్డులు, సర్పంచ్‌ల రిజర్వేషన్ల ప్రక్రియను జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉండడంతో వీటి ఖరారుకు అధిక సమయం పట్టినట్టు తెలుస్తోంది.

**వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో జారీ చేశాక...జిల్లాల్లో ఇప్పటికే సిద్ధం చేసిన రిజర్వేషన్ల జాబితాలను పరిశీస్తారు. ఏమైనా మార్పు చేర్పు లుంటే సరి చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేయాలని కలెక్టర్లకు ఉన్నతాధికారులు సూచించారు. అయితే వీటితో పాటు వార్డు సభ్యులు, సర్పంచ్‌ల రిజర్వేషన్లు కూడా పూర్తి చేయాలనే ఆదేశాలతో.. వాటిని కూడా జిల్లా, మండల, గ్రామ అధికారులు పూర్తి చేసినట్టు తెలుస్తోంది. జిల్లా పరిషత్ చైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ కమిషనర్ ఖరారు చేయాల్సి ఉండగా, అది కూడా పూర్తయినట్టు ప్రచారం జరుగుతోంది.

**రాజకీయంగా ప్రయోజనం పొందేందుకు...**

ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున.. దీని ద్వారా అధికార పార్టీకి ఈ ఎన్నికల్లో పూర్తి లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజారిటీ జెడ్పీలు, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ, సర్పంచ్ స్థానాల్లో గెలుచుకునేందుకు వీలుగా ముందుగా మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ వారం లోగా నోటిఫికేషన్ వెలువడితే..మూడు వారాల వ్యవధిలో రెండు విడతల్లో ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికలు పూర్తిచేయాలనే ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇవి ముగిశాక కొన్నిరోజుల అంతరంతో గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి ఆ తర్వాత మూడు వారాల వ్యవధిలోనే ఆ ప్రక్రియ ముగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ నెలాఖరులోగా నోటిఫికేషన్ సాధ్యం కాని పక్షంలో.. కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఇంతవరకు జరిపిన కసరత్తుకు సంబంధించిన వివరాలు హైకోర్టుకు తెలియజేసి మరింత సమయం కోరే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతోంది.

**రిజర్వేషన్లు ఇలా..!**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం చూస్తే..జిల్లా ప్రజా పరిషత్‌లు (జెడ్పీపీలు) 31, జెడ్పీటీసీ స్థానాలు 565 , మండల ప్రజాపరిషత్‌లు 565, ఎంపీటీసీ స్థానాలు 5,763, గ్రామపంచాయతీలు- 12,760, వార్డుల సంఖ్య 1,12,534 గా ఖరారు అయ్యాయి. తెలంగాణ ఏర్పాటయ్యాక 2019లో పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు 570, ఎంపీటీసీలు 5,817, గ్రామపంచాయతీలు 12,848గా ఉన్నాయి.

అయితే ఇప్పుడు 1 జెడ్పీపీ, 5 జెడ్పీటీసీ, 5 ఎంపీపీలు, 54 ఎంపీటీసీ స్థానాలు, 185 గ్రామ పంచాయతీలు తగ్గాయి. మేడ్చల్-మల్కాజిగిరిలోని మెజారిటీ గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో గ్రామీణ జిల్లా ఉనికి లేకుండా పోయింది. ఒక జెడ్పీపీ, 4 జెడ్పీటీసీల సంఖ్య తగ్గుదలకు ఇది కారణంగా నిలుస్తోంది.

# ఓటర్ చోరీ ఉద్యమంలో నైతిక విజయం

- **పాట్నా CWC సమావేశంలో మహేష్ కుమార్ ప్రసంగం**
- **ఓటర్ చోరీ ఉద్యమంలో నైతిక విజయం**
- **తెలంగాణ బీసీ రిజర్వేషన్లలో దేశానికి ఆదర్శం**
- **రాహుల్ గాంధీ నాయకత్వంలో ప్రజా పోరాటం మరియు మద్దతు**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**



పాట్నా లో జరిగిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ (CWC) సమావేశంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ టీ (TPCC) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రధాన ప్రసంగం చేశారు. ఆయన ప్రసంగంలో ప్రధానంగా ఓటర్ చోరీ ఉద్యమం, బీసీ రిజర్వేషన్ల అమలు, రాహుల్ గాంధీ నాయకత్వంలో సాగిన ప్రజా ఉద్యమాలపై ఫోకస్ పెట్టారు. మహేష్ కుమార్ చెప్పారు, "ఓటర్ చోరీపై కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ప్రయత్నాలు నైతిక విజయం సాధించాయి. బీసీ రిజర్వేషన్ల కోసం తెలంగాణ చూపిన పోరాటం దేశానికి ఆదర్శంగా నిలిచింది." ఆయన అంతకుముందు రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపట్టిన ఉద్యమాలకు ప్రజల నుంచి అద్భుతమైన స్పందన వస్తోందని, ఓటర్ చోరీ కారణంగానే బీజేపీ మూడోసారి గెలిచిందని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు.

ప్రజా పోరాటం ద్వారా రాహుల్ గాంధీ , కాంగ్రెస్ పార్టీ బీజేపీపై నైతిక విజయం సాధించారని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర , రాష్ట్రంలో ప్రభుత్వ చర్యలు ఫలితంగా 42% రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ, రాజకీయ విభాగాల్లో అమలు దశకు చేరాయని చెప్పారు. తెలంగాణ బీసీ రిజర్వేషన్ల వ్యవస్థ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన చెప్పారు.

మహేష్ గౌడ్ ప్రస్తావించారు, "రాహుల్ గాంధీ సామాజిక న్యాయం కోసం చేస్తున్న కృషి, ప్రజా పోరాటం , పార్టీ విధానాల అమలు నేటి సమాజానికి ఆదర్శం. ఈ మార్గదర్శనం ప్రతి ఒక్కరికి ప్రేరణగా నిలుస్తుంది." ఈ సమావేశంలో AICC ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ప్రసంగించి పార్టీ పాలన, సామాజిక సమానత్వం, రాష్ట్రాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ తీసుకుంటున్న ప్రయత్నాలపై వివరించారు. సారాంశంగా, పాట్నా CWC సమావేశం తెలంగాణలో బీసీ రిజర్వేషన్లు, ఓటర్ చోరీపై కాంగ్రెస్ పార్టీ నాటి వ్యూహాలను, రాహుల్ గాంధీ నాయకత్వంలోని సామాజిక పోరాటాలను ప్రస్తుత దేశ రాజకీయ దృశ్యంలో రీహైలైట్ చేసింది.

## హైడ్రాకు అదనంగా రూ.69 కోట్లు విడుదల

**ప్రజాస్వరం, హైదరాబాద్:**

హైదరాబాద్ నగరంలో విపత్తులను ఎదుర్కోవడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయపడడం, ఆస్తులను కాపాడడం వంటి ముఖ్య బాధ్యతలు నిర్వర్తిస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు ప్రభుత్వం భారీగా నిధులను విడుదల చేసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఇలంబర్తి బుధవారం ఉత్తర్వులు జారీ చేస్తూ మొత్తం రూ.69 కోట్లు హైడ్రాకు మంజూరు చేశారు. ముఖ్యంగా ఈ నిధులు బడ్జెట్‌లో ముందస్తుగా కేటాయించబడకపోయినా, అత్యవసర అవసరాలను దృష్టిలో పెట్టుకొని అదనంగా విడుదల చేసినట్టు ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇది కాకుండా, హైడ్రాలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని జీహెచ్ఎంసీ నుంచి మ్యాచింగ్ గ్రాంట్స్ కింద మరో రూ.20 కోట్లు హైడ్రాకు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా ఉద్యోగుల వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తాజా నిధుల విడుదలతో పెండింగ్‌లో ఉన్న వేతనాలను క్లియర్ చేయడానికి మార్గం సుగమం అవుతుందని సంబంధిత అధికారులు స్పష్టంచేశారు. హైడ్రా విపత్తు నిర్వహణలోనే కాకుండా వర్షాకాలం, వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు వంటి అనుకోని పరిస్థితుల్లో ముందుండి సహాయ చర్యలు చేపడుతుంది. అలాంటి సందర్భాల్లో రిస్క్ తీసుకుంటూ పనిచేసే ఉద్యోగులు చాలా కాలంగా వేతనాలు అందక నిరాశలో ఉన్నారు. ఈ కొత్త నిధుల మంజూరుతో వారి సమస్యలకు కొంతవరకు పరిష్కారం లభించనుంది. అదనపు నిధుల మంజూరుతో హైడ్రా మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఆధునిక పరికరాలు, రక్షణ సామాగ్రి కొనుగోలు చేయడంలో ఈ నిధులు ఉపయోగపడతాయి. దీని వల్ల అత్యవసర పరిస్థితుల్లో హైడ్రా వేగవంతంగా స్పందించగలదు. హైదరాబాద్ వంటి మెట్రో నగరంలో విపత్తు నిర్వహణకు ఎప్పటికప్పుడు నిధులు, సదుపాయాలు అవసరమవుతుంటాయి.

# వారిని నేను ఆహ్వానిస్తున్నా

- **తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**
- **రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పని చేసి విజయం సాధించామన్న కవిత**
- **తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం అందరం కలిసి సాగుదామని పిలుపు**
- **జాగృతిలో చేరే కొత్తవారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామని హామీ**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**

సామాజిక తెలంగాణ కోసం పని చేసేవారిని ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈరోజు ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు మనమందరం ఐక్యంగా పోరాడి విజయం సాధించామని గుర్తు చేశారు. తదుపరి లక్ష్యమైన సామాజిక తెలంగాణను సాధించే దిశగా మనమందరం కలిసి ముందుకు సాగుదామని ఆమె పిలుపునిచ్చారు. ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ కోసం పాటు పడదామని కవిత అన్నారు. పునరేకీకరణ కోసం ఐక్యంగా పోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడి తాము పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని ముందుకు వచ్చిన రంగారెడ్డి జిల్లావాసులను ఆమె సాదరంగా ఆహ్వానించారు. జాగృతిలో ఇదివరకే ఉన్న నాయకత్వంతో పాటు,



కొత్తగా చేరుతున్న వారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంతో సహా నగరంలోని హైడ్రా బాధితులైన పేదల తరపున తాము పోరాడుతామని ఆమె తెలిపారు. భవిష్యత్తులో కూడా పేద ప్రజల కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 100% బీజేపీ విజయం సాధిస్తుంది

- **తెలంగాణలో బీజేపీ స్థిరంగా ఎదుగుతోంది**
- **జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో 100% బీజేపీ గెలుస్తుంది**
- **కిషన్ రెడ్డి నేతృత్వంలో విజయం ఖాయం.**

**ప్రజాస్వరం, హైదరాబాద్:**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధ్యక్షతన బీజేపీ ఆఫీస్ బేరర్స్ మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇందులో భాగంగా.. తెలంగాణలో బీజేపీ క్రమంగా ఎదుగుతోందని, ఒకప్పుడు గ్రామాల్లో ఒకటి రెండు ఓట్లు వచ్చిన చోట ఇప్పుడు వందల సంఖ్యలో ఓట్లు వస్తున్నాయని రామచందర్ రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు బీజేపీని గుర్తించారని, గెలుపు చూస్తున్నామని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ ఇచ్చారని కాంగ్రెస్, కేసీఆర్ తెచ్చారని బీఆర్ఎస్ చెబుతున్నాయని.. కానీ, పార్లమెంట్‌లో బిల్లుకు బీజేపీ మద్దతు ఇవ్వడం వల్లే తెలంగాణ వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. ఉద్యమ సమయంలో ఆత్మహత్యలకు కాంగ్రెస్ కారణమని ఆరోపించారు. గత పదేళ్లుగా పాలకులు మాటలతో మభ్యపెట్టారని, కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క డిక్లరేషన్ కూడా అమలు కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించాయని, గ్రూప్ 1 పోస్టులను భర్తీ చేయలేకపోతున్నాయని అన్నారు. అలాగే బీసీలను కాంగ్రెస్ మోసం చేసిందని, అయితే కేంద్రంలో మోడీ ప్రభుత్వం విశ్వకర్మ పథకం తెచ్చిందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లకు బీజేపీ మద్దతు ఇస్తుందని, జీఓ ఇస్తే తాము కూడా మద్దతు ఇస్తామని హామీ ఇచ్చారు. జీఎస్టీ వల్ల అన్ని వర్గాల ప్రజలకు లాభం చేకూరిందని, నిత్యావసరాలు తక్కువ ధరలకు దొరకడానికి మోడీయే కారణమని చెప్పారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్ వంటి కేంద్ర పథకాలు తెలంగాణలో ప్రజలకు చేరడం లేదని ఆరోపించారు. రాష్ట్రానికి 12 లక్షల కోట్ల రూపాయలు వచ్చాయని తెలిపారు.

ఇంకా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని లోటు చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే పని చేస్తుందని విమర్శించారు. ఎరువుల కొరత రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా లోపమేనని అన్నారు. ఆఫీస్ బేరర్లు హైదరాబాద్‌ను వదిలి గ్రామాలకు వెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, కేంద్రం చేస్తున్న పనులను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ఇక రాష్ట్రంలోని స్థానిక ఎన్నికలను ఆపొద్దని, వాటిలో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కిషన్ రెడ్డి నాయకత్వంలో వంద శాతం బీజేపీ గెలుస్తుందని తెలిపారు. రేవంత్ రెడ్డికి ఆట చేతగాక కిషన్ రెడ్డిపై మాట్లాడుతున్నారని విమర్శించారు.



## ఘనంగా సేవాలాల్ మహారాజ్ జగదాంబ మాత

# శరన్నవరాత్రులు

**మెదక్, (ప్రజా స్వరం) :** హవేలీ ఘనపూర్ మండలం కొచ్చేరువు తండా గ్రామ పంచాయతీ గాజులవాయి తాండ లో శ్రీ సంత్ సేవా లాల్ మహారాజ్ జగదాంబ మాత ఆలయంలో గిరిజన మహిళలు బోనాలు సమర్పించి, గిరిజన వేషాధారణ లో నృత్యం చేసి బొగ్ బండార్ కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సంత్ సేవా లాల్ జగదాంబ మాత దీక్ష స్వాముల ఆధ్వర్యం లో ప్రతి ఇంటి ముందు హోమం నిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా దీక్ష స్వామి శ్రీను నాయక్ మాట్లాడుతూ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భవాని మాత అమ్మవారు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. సేవా లాల్, దుర్గమ్మ దయ తో తెలంగాణ ప్రజలు పాడి, పంట ఆరోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. యువత ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకుంటు, శాంతి, అహింస అలవరుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి భిల్యా నాయక్, బిఆర్ఎస్ యువ నాయకులు శ్రీను నాయక్, ప్రవీణ్ నాయక్, సానిక్ష ఫౌండేషన్ అధ్యక్షులు శివనాయక్, సుభాష్ నాయక్, నవీన్ నాయక్, శ్రీను నాయక్, నరేష్ నాయక్, అరుణ్ నాయక్, రవి నాయక్, దీక్ష స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.









## కృష్ణానగర్‌లో మంత్రులు పొన్నం, వివేక్ పర్యటన

**హైదరాబాద్ (ప్రజాస్వరం) :**
యూసుఫ్ గూడా డివిజన్ లోని కృష్ణానగర్ లో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి బుధవారం పర్యటించారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు. కృష్ణ నగర్ లో వర్షం కురిసినప్పుడు వరద రావడానికి కారణమైన నాలలను మంత్రులు పరిశీలించారు. నాలాలు "బాటిల్ నెక్ ప్రాబ్లం" వల్లే కృష్ణ నగర్ లో వరదలు వస్తున్నాయి. కృష్ణ నగర్ లో భవిష్యత్ లో వరద రాకుండా ఉండడానికి ఇప్పుడున్న నాలాలు అభివృద్ధి చేయడానికి ఎస్ఎన్డీపీ కి ఇచ్చామని మంత్రులు తెలిపారు. కృష్ణ నగర్ లో కొనసాగుతున్న జీహెచ్ఎంసీ పెండింగ్ పనుల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను మంత్రులు ఆదేశించారు.

### దసరా బతుకమ్మ పండుగ సందర్భంగా

## ట్రాఫిక్ ఆంక్షలు




**సిద్దిపేట / గజ్వేల్ సెప్టెంబర్ 24 (ప్రజాస్వరం) :**
సిద్దిపేట పట్టణంలో సుభాష్ రోడ్డు, పుష్పాంజలి ఎక్స్ రోడ్, ఓల్డ్ మార్కెట్ మాంగల్య షాపింగ్ మాల్ రోడ్లలో ట్రాఫిక్ ఆంక్షలు విధించడం జరిగిందని సిద్దిపేట ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. .మెయిన్ రోడ్ నుండి సుభాష్ రోడ్డు వెళ్లే వాహనదారులు మోటార్ సైకిల్ పై మాత్రమే వెళ్లాలి ఆటోలలో కార్లలో వెళ్లడానికి వీల్లేదన్నారు. పుష్పాంజలి ఎక్స్ రోడ్ నుండి సుభాష్ రోడ్డుకు వచ్చే వాహనదారులు మోటార్ సైకిల్ పై మాత్రమే రావాలని అన్నారు. మార్కెట్ నుండి మాంగళ్య షాపింగ్ వరకు మోటర్ సైకిల్ పై వెళ్ళాలి అటువైపు నాలుగు చక్రాల వాహనాలు ఆటోలను అనుమతించడం లేదని సంతోష్ మాత టెంపుల్ నుండి ప్రజలు మోటార్ సైకిల్ పై మాత్రమే రావాలని బురుజు నుండి సుభాష్ రోడ్డు వల్లే ప్రజలు మోటార్ సైకిల్ పై మాత్రమే వెళ్లాలన్నారు. రెండు వైపులా నాలుగు చక్రాల వాహనాలను ఆటోలను అనుమతించడం లేదని వెల్లడించారు. ట్రాన్స్ పోర్ట్ వాహనాలు ఉదయం 10 గంటల లోపు ట్రాన్స్ పోర్ట్ లో సామాను దించి బయటకు వెళ్ళిపోవాలి, లేనిపక్షంలో మరియు రాత్రి 8 గంటల తర్వాత ట్రాన్స్పోర్ట్ వాహనాలు వెళ్లి ట్రాన్స్పోర్ట్ లో సామాను దించవచ్చు. వాహనదారులు ప్రజలు పండుగ రోజులలో పోలీస్ శాఖకు సహకరించాలని ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ ఆంక్షలు విధించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని, వ్యాపారాలు చేసుకోవాలని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## సంఘటితంతోనే ఐక్యత బలం

### ఆచార్య నరేంద్ర జి నిర్మల్ జిల్లా ధర్మజాదరం ప్రముక్



**తూప్రాన్, సెప్టెంబర్ 24,ప్రజాస్వరం:**
కులమతాలకు అతీతంగా సంఘటితంతోనే ఐక్యత బలం చేకూరుతుందని ధర్మ జాగరాన్ ప్రముఖ ఆచార్య నరేంద్ర జి పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ లోని ఆర్యవైశ్య భవన్ లో సామాజిక సమరసత కార్యక్రమాన్ని దుర్గాభవాని సేవాసపతి ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిర్మల్ జిల్లా ధర్మజాగరణ్ ప్రముఖ ఆచార్య నరేంద్రజీ, స్వామీజీలు తూప్రాన్ దుర్గా భవనీ సేవా సమితి నిర్వాహకులు అశోక్ గౌడ్, మామిడి వెంకటేష్, కోటేశ్వరరావు లతో కలిసి పాల్గొని మాట్లాడారు. హిందువులందరూ సంస్కృతి సంప్రదాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించి కుల మతాలకు అతీతంగా హిందూ ధర్మం వైపే పయనించాలన్నారు. చిన్నతనం నుండే క్రమశిక్షణ భావాలను విద్యార్థుల్లో నింపాలని కొన్ని వేల సంవత్సరాల ఘన చరిత్ర గల శాస్త్రాలు పురాణాలు అందరికీ తెలియజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు కుమార్,పల్లెర్ల బాలేష్,కొవ్వూరి శ్రీనివాస్, చెలిమెల రఘుపతి, విద్యాసాగర్, బండెల నరేష్, వెంకట్ చారి, జంగం రాములు,మామిండ్ల శ్రీనివాస్,బుక్క అశోక్,తాటి విఠల్,గడ్డం సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంటల సర్వే వేగవంతం చేయాలి



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 24(ప్రజాస్వరం) :**
రైతుల వారీగా పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని దుబ్బాక ఏ డి ఏ కాంపాటి మల్లయ్య సూచించారు. బుధవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో బుధవారం బుధవారం వర్షాకాలంలో సాగుచేసిన పంటలను పరిశీలించి వివరాల నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ ప్రకారంగా రైతులు ఏ పంటలు వేశారు. అనే వివరాలను తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్ర స్థాయి లో పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. దీని ద్వారా పంటలు విక్రయించే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని సూచించారు. పంటల వివరాల నమోదులో రైతులు ఏ ఈ ఓ లుకు సహకరించి సర్వే పూర్తి చేయాలని సూచించారు. ఈ పాల్గొన్నారు కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ ఏఈఓలు సంతోష్ కుమార్, సునంద తో పాటు అన్నదాతలు పాల్గొన్నారు

## శ్రీ విద్యాధరి క్షేత్ర మహత్యం అద్భుతం

- **పర్వదినాల్లో దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం**
- **కంచి స్వామి ఆశీస్సులు, కంచి పీఠం ఆధ్వర్యంలో చక్కటి నిర్వహణ**
- **వేద మంత్రాలు మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు**
- **తెలంగాణ రాష్ట్రానికి వర్గల్ క్షేత్రం ఆశీర్వాదం**
- **శరవేగంగా శ్రీ విద్యాధరి ఆలయం అభివృద్ధి చెందాలని ఆకాంక్ష**
- **అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులతో చక్కటి విద్యావంతులు కావాలి**
- **జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

**వర్గల్ / గజ్వేల్ సెప్టెంబర్ 24 (ప్రజాస్వరం ) :**
వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర మహత్యం గొప్పదని, ఈ పర్వదినాల్లో అమ్మవారిని దర్శించుకోవాలనే సంకల్పం నెరవేరిందని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండల కేంద్రంలోని శ్రీ విద్యాధరి ఆలయాన్ని దర్శించుకుని ఆమె శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు కవితను శేష వస్త్రంతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం కాగా, కంచి స్వామి ఆశీస్సులు కంచి పీఠం ఆధ్వర్యంలో చక్కటి నిర్వహణ ఉన్నట్లు స్పష్టం చేశారు. అంతేకాకుండా వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా వేద పండితులు పూజాది కార్యక్రమాలు కార్యక్రమాలు చేయడం సంతృప్తి కలిగించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి వర్గల్ క్షేత్రం ఆశీర్వాదం కాగా, దేశంలోనే ఉన్నత పుణ్యక్షేత్రంగా ఎదగాలని ఆమె అన్నారు. అమ్మవారి సంపూర్ణ ఆశీస్సులతో ఆలయాన్ని దర్శించిన చిన్నారులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాగా మొదటగా ఆమెను క్షేత్ర నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. లీగల్ సెల్ నేత, జాగృతి రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.



## జాతీయ సమైక్యతా శిబిరాలతో చక్కటి నడవడిక

- **సామాజిక సేవలో ఎన్ఎస్ఎస్ సేవలు ప్రశంసనీయం**
- **చక్కటి ప్రతిభ కనబరుస్తున్న హంస మెడికల్ కళాశాల విద్యార్థులు**
- **కాళోజి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి**

**ములుగు / గజ్వేల్, సెప్టెంబర్ 24 (ప్రజాస్వరం) :**
ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటు సామాజిక సేవలో ప్రోత్సహించడమే జాతీయ సేవా పథకం లక్ష్యమని కాళోజి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా క్షీరసాగర్ లోని హంస మెడికల్ కాలేజ్ లో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఊహించని విపత్తుల నిర్వహణలో ఎన్ఎస్ఎస్ సాహస కృత్యాలు ప్రశంసనీయమని కొనియాడారు. ముఖ్యంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు జాతీయ సమైక్యత శిబిరాల్లో పాల్గొనడం ద్వారా చక్కటి నడవడిక, క్రమశిక్షణకు దోహదపడుతుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ స్వచ్ఛభారత్, సర్వేజనా సుఖినోభవంతు వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువతను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యత, చక్కటి సంబంధాలను మెరుగుపరచుకోవడం, విద్యార్థులను దేశ సేవలో భాగస్వాములను చేయడం లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ దేశవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నట్లు గుర్తు చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, సామాజిక సేవకు అంకితం అవ్వాలని ఆకాంక్షించారు. హంస మెడికల్ కళాశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరుస్తుండగా, వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు తనను మంత్రముగ్ధుల్ని చేసినట్లు చెప్పారు. దేశ పురోభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకొని పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేసినట్లు చెప్పారు. విద్యార్థుల్లో కల్మషం లేని భావన ఉంటుందని, విద్యకు ఆటంకం లేకుండా సామాజిక సేవలను విస్తృతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హంస మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఉమేష్ ఆయనను ఘనంగా సత్కరించగా, ఈ కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీల శాఖల అధిపతులు డాక్టర్ మల్లేశ్వర్, డాక్టర్ రాం కుమార్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ నూరున్ షెహర్ ఖాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కత్తి శ్రీనివాస్ బాబు తదితరులు పాల్గొన్నారు.





## మంథని జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు




**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్ 24(ప్రజా స్వరం):**
మంథనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ఉచిత విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రైవేటుకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించడం గొప్ప విషయం అన్నారు.పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో ఈ కళాశాల నుంచి శ్రీజ ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయం అన్నారు.కళాశాలలో ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు.అకడమిక్ క్లాసులు మాత్రమే కాకుండా ఎప్ సెట్,నీట్,క్లాట్ మొదలైన పోటీ పరీక్షలకు సైతం విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం,రిటైర్డ్ ప్రినిపాల్ అంబరీష్,అధ్యాపకులు ఝాన్సీ,శ్రీధర్ రావు,తిరుపతి,తిరుమల్, శశాంక్,నగేష్,ఎల్ ఆర్ కే రెడ్డి,శ్రీదేవి,సబిత,మౌనిక,సురేష్,దీపారాణి,సిబ్బంది రాజన్న,అనసూర్య,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## డా. యస్ కె ఘూయి బండారి అవార్డు పొందిన డా. కల్పన

**మేడ్చల్, (ప్రజాస్వరం):**
ఆబ్ స్ట్రిక్స్, గైనకాలజీ లో వ్యాధి నివారణ అన్న అంశంలో గ్రామీణ ప్రాంతాలలో నివసించే మహిళలు సర్వికల్ (గర్భాశయ) క్యాన్సర్ ను గుర్తించడానికి అవసరమైన పాప్ స్మియర్ పరీక్ష కోసం ఇంటి వద్దనే స్వాబ్ సాంపిల్ ను తీసుకోవడం యొక్క ఆమోదయోగ్యత మరియు సాధ్యాసాధ్యాలపై అందించిన పరిశోధనా పత్రానికి డా. కల్పన, హెఓడి, గైనకాలజీ విభాగం, మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వారు ప్రఖ్యాత డా. యస్ కె ఘూయి బండారి అవార్డు అందుకొన్నారు. ప్రఖ్యాత రాయల్ కాలేజ్ ఆఫ్ ఆబ్ స్ట్రీషియన్స్, గైనకాలజిస్టు వారి ఆల్ ఇండియా కో ఆర్డినేషన్ కమిటి వారు నిర్వహించే 38 వ ఏఐసీసీ ఆర్సిఓజీ వార్షిక సదస్సు లో డా. కల్పన ప్రవేశ పెట్టిన ఈ పరిశోధనా పత్రానికి ఈ అవార్డు లభించింది.ఈ పరిశోదనా పత్రంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఇంటి వద్దనే చేయించుకొనే పరీక్షల నాణ్యత, వాటి వినియోగం, ఆ పరీక్షా శ్యాంపిల్ ఖచ్చితత్వం లాంటి పలు విషయాలను డా. కల్పన సోదోహారణంగా వివరించారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవాలి

- **జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మండల రవీందర్**

**పెద్దపల్లి,సెప్టెంబర్24(ప్రజా స్వరం):**
నవంబర్ 19 2025లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి క్రింద ఉన్నత చదువుల కై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మండల రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన వారు (ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన/చివరి సంవత్సరం చదువుతున్న) వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని,అమెరికా,ఇంగ్లాండ్,ఆస్ట్రేలియా,కెనడా,న్యూజిలాండ్,జర్మనీ జపాన్,సింగపూర్,సౌత్ కొరియా మొదలగు దేశాలలో ఉన్నత చదువు చదివేందుకు వెళ్ళేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థి పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్ లో 60శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చి ఉండాలని,కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షల రూపాయల లోపు ఉండాలని,టోఫెల్ జి.ఆర్.ఈ. జి మ్యాట్ లలో అర్హత కలిగి ఉండడంతో పాటు పాస్ పోర్ట్ కలిగి ఉండి విదేశీ విద్యాలయంలో ప్రవేశం పొంది ఉండాలని తెలిపారు.ఆసక్తి గల పెద్దపల్లి జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు https://telanganaepasscbbgov.in ద్వారా నవంబర్ 19 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఉప సంచాలకులు ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి మండల రవీందర్ ఆ ప్రకటనలో తెలిపారు.




- పన్ను తగ్గింపుతో ఉపశమనం
- పేద, మధ్యతరగతి వర్గాలకు మేలు
- 28 నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గింపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- ఇంధన ధరలపై పన్ను తగ్గించాలని పలువురి సూచన
- పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు
- మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జేకే శైలజహరినాథ్

# జీఎస్టీ.. ఊరట

**మేడ్చల్, (ప్రజా స్వరం) :**
నిత్యవసరాల వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్యులు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గిస్తూ ప్రజలకు తీపి కబురు తెలిపింది. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు భారీ ఉపశమనాన్ని కలగజేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ (సరుకులు, సేవల పన్ను) రేట్లలో తగ్గింపులు చేయడం సాధారణ ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయంగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.


**తగ్గింపులో ప్రధాన రంగాలు :**
జీఎస్టీ తగ్గింపు పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ప్రకారం దినసరి అవసరాల సరుకులు (పప్పులు, పిండి, పాల ఉత్పత్తులు, నూనె)పై జీఎస్టీ తగ్గింపులు అమల్లోకి వచ్చాయి. గృహోపకరణాల (ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, మిక్సీ, ఎలక్ట్రానిక్ వస్తువులు)పై పన్ను శ్లాబులు తగ్గించడంతో మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనం లభిస్తోందని పేర్కొనవచ్చు.

**వ్యవసాయ రంగానికి భారీ ఊరట :**
వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు, పరికరాలపై పన్ను తగ్గింపుతో రైతులకు భారీ ఊరట కలిగించే అంశమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా చిరు వ్యాపారాల సేవలపై తగ్గింపుతో చిన్న వ్యాపార వర్గాల వ్యయం తగ్గుతుందని పలువురు మండల ప్రజలు పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపు తక్షణ ప్రభావం వినియోగదారులపై పడుతుంది. వస్తువుల ధరలు తగ్గుతాయి. మార్కెట్లో కొనుగోలు శక్తి పెరుగుతుంది. వినియోగం పెరిగితే ఉత్పత్తి రంగానికి కూడా ఊతం లభిస్తుంది. అన్ని వర్గాలకు ఈ నిర్ణయం ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

**ఇంధన ధరలు తగ్గించాలి :**
ఇంధన ధరలు అధికంగా ఉండటం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం అన్ని వస్తువులపై పడుతోంది. జీఎస్టీ తగ్గింపు కొంత ఉపశమనం కలిగించినా, ఇంధన ధరలు కూడా నియంత్రణలోకి రావాలి. నిత్యావసరాలపై తగ్గించినట్టే ఇంధన ధరలపై పన్ను భారం
తగ్గించాలి.

**ముందున్న సవాళ్లు :**
నిపుణుల అభిప్రాయం ప్రకారం జీఎస్టీ తగ్గింపుతో తక్షణ ఉపశమనం లభించినా, దీర్ఘకాలంలో ఇది ద్రవ్యోల్బణ నియంత్రణకు ఎంతవరకు దోహదపడుతుందన్నది చూడాలని, ఎందుకంటే మార్కెట్లో సరఫరా సమస్యలు, ఇంధన ధరలు, గ్లోబల్ పరిస్థితులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని పలువురు విశ్లేషకులు పేర్కొన్నారు.


**జీఎస్టీ అమలులో మార్పులు :**
2017లో జీఎస్టీ అమలు చేసిన తర్వాత అనేక మార్పు సవరణలు జరిగాయి. ఆరంభంలో అధిక రేట్లపై విమర్శలు రావడంతో అవసరమైన వస్తువులపై కేంద్ర ప్రభుత్వం పన్నులు తగ్గిస్తూ వచ్చింది. ఉదాహరణకు చాక్లెట్లు, మిఠాయి, గృహోపకరణాలపై 28 శాతం పన్ను ఉండగా తర్వాత దాన్ని 18శాతానికి తగ్గించారు. దీంతో మధ్య తరగతి కుటుంబాలకు ఇది ఉపశమనమేనని పలువురు మహిళలు పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా ప్రతి నెలా సరుకుల ఖర్చు గణనీయంగా పెరిగిందని, ఇప్పుడు కొంత తగ్గితే మాకు ఊరట లభిస్తుందని మేడ్చల్ పట్టణ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.





## పేద మధ్యతరగతి వర్గాలకు ఎంతో మేలు

- **జేకే శైలజహరినాథ్, మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు**



కేంద్ర ప్రభుత్వం సామాన్య మధ్య తరగతి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందుబాటులోకి తీసుకురావాలనే సద్దుదేశంతో జీఎస్టీని ప్రధానంగా రెండు స్లాబ్ లు 28 నుంచి 18 శాతంగా, 18 నుంచి 5 శాతంగా తగ్గించారు. జీవిత బీమాపై జీఎస్టీని పూర్తిగా ఎత్తేయడం వల్ల ఇన్సూరెన్స్ చేసుకునే ప్రతి ఒక్కరికీ లాభాన్ని చేకూర్చారు. మధ్య తరగతి వారి కోసం ఎలక్ట్రానిక్ వస్తువులపై జీఎస్టీ తగ్గింపు వల్ల చిన్న తరహా పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని పెంచారు. విదేశీ ఉత్పత్తులపై భారీగా పెంచడం వల్ల స్వదేశీ ఉత్పత్తులు కొనుగోలు చేసి దేశ ఆర్థిక వ్యవస్థ బలపరిచే దిశగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పొగాకు ఉత్పత్తులపై జీఎస్టీ శాతాన్ని పెంచడం ద్వారా వాటికి ప్రజలు దూరంగా ఉండే విధంగా చేసిన కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని నరేంద్రమోడీకి ధన్యవాదాలు.



# తూప్రాన్‌లో డిగ్రీ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

## మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**తూప్రాన్, సెప్టెంబర్ 24, ప్రజాస్వరం:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ కేంద్రంలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేసేందుకు జిల్లా మంత్రులు చొరవ తీసుకోవాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా బుధవారం తూప్రాన్ లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మొక్కను నాటారు. ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ గెలిచి పదేళ్ల పాలనలో తన సొంత గజ్వేల్ సెగ్మెంట్లోని తూప్రాన్ మున్సిపల్ పట్టణం లో ఒక్క డిగ్రీ కాలేజ్ కూడా ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఇలాంటి వాళ్ళు రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేశాం అని మాట్లాడుతున్నారు.నేను మాట్లాడితే కాంగ్రెస్ వల్లనే తిట్టాలే కదా బి ఆర్ ఎస్ వాళ్లను తిడుతున్నాడని కొందరు యూట్యూబ్ ఛానెల్ వాళ్ళు బాగా ఆవేశ పడుతున్నారన్నారు.వీళ్ళంతా ఒక్కసారి మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గం తూప్రాన్ కి వచ్చి ఇక్కడ ప్రజలను అడగాలన్నారు. సీఎంగా తొమ్మిదిన్నర సంవత్సరాలు చేసిన కేసీఆర్ తూప్రాన్ లో ఒక్క డిగ్రీ కాలేజ్ కూడా ఎందుకు ఏర్పాటు చేయలేదో అడిగి తెలుసుకోవాలన్నారు. కెటిఆర్ కేసీఆర్ దగ్గర జీతాలు తీసుకొనే యూట్యూబ్ ఛానెల్ వాళ్ళకి రఘునందన్ విమర్శించే స్థాయి లేదన్నారు.డిగ్రీ కాలేజ్ అందుబాటులో లేకపోవడం తో చదువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్ళలేక ఇంటర్మీడియట్ పూర్తి అవగానే కొంత మంది ఆడ పిల్లలకు పెళ్లిచేస్తున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచి 20 నెలల గడుస్తున్న తూప్రాన్ లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు కోసం ఆలోచన చేయాలన్నారు.వచ్చే సంవత్సరం జూన్ వరకు తూప్రాన్ లో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేసేందుకు జిల్లా ఇంచార్జి మంత్రి గడ్డం వివేక్ చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్డెంట్ అమర్ సింగ్, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, జిల్లా నాయకులు గడ్డం శ్రీనివాస్, జానకిరామ్ గౌడ్, మహేష్ గౌడ్, దుర్గరాజు యాదవ్, సాయిబాబా గౌడ్,సంఖ్య యాదగిరి, మధు, నాగరాజ్,శరత్ హరిప్రసాద్ తదితరులున్నారు.







# హెల్త్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

## మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్




**మంథని,సెప్టెంబర్24(ప్రజా స్వర:** మంథని ప్రెస్ క్లబ్,కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపు గురువారం నిర్వహించడం జరుగుతుందని, సద్వినియోగం చేసుకోగలరని మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ మెడికవర్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని,ఈ క్యాంపులో బిపి,షుగర్,టుడికో,జి ఆర్ బి ఎస్,ఈసీజీ,రక్త పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఉచిత క్యాంపును సద్వినియోగం చేసుకోగలరని ఆయన సూచించారు.

# సింగరేణి కార్మికుల శ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుంది


## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**గోదావరిఖని/పెద్దపల్లి,సెప్టెంబర్24(ప్రజా స్వరం):** సింగరేణి కార్మికుల శ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని లాభాల వాటా లో అంకెల గారడి ప్రదర్శించి కార్మికులను అయోమయానికి గురిచేశారని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు.పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడారు.బిఆర్ఎస్ హయాంలో నికర లాభం నుండి కార్మికులకు లాభాల వాటా పంచారని ఆయన గుర్తు చేశారు.గత ఆర్థిక సంవత్సరం మాదిరిగానే ప్రస్తుతం కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వాడుకుంటుందని ఆయన ధ్వజమెత్తారు.సంస్థ విస్తరణ పేరుతో వేలకోట్ల రూపాలు పక్కన పెట్టిన రేవంత్ సర్కార్ వాటి లెక్క ఏమైందని చందర్ ప్రశ్నించారు.రక్తాన్ని చెమటగా మార్చి దేశానికి వెలుగులను పంచే గని కార్మికుల శ్రమను కాంగ్రెస్ పెద్దలు వాటాలు వేసి పంచుకుంటున్నారన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న లేకపోయినా కార్మికుల పక్షాన పోరాడుతుందని కార్మికులకు న్యాయం జరిగే వరకూ ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు నికర లాభం నుండి 34 శాతం వాటా ఇవ్వాలని లేని పక్షంలో కోల్ బెల్ట్ ప్రజా ప్రతినిధులను ప్రతిఘటిస్తామని చందర్ హెచ్చరించారు.




# శరణ్య నవరాత్రి ఉత్సవాల్లో అన్నపూర్ణ దేవి దర్శనం



**దౌల్తాబాద్ సెప్టెంబర్ 24(ప్రజాస్వరం )** శరణ్య నవరాత్రి ఉత్సవాలు మండల కేంద్రమైన దౌల్తాబాద్ లోని దుర్గ భవాని ఆలయంలో ముత్యం గారి పోచయ్య కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను తయారు చేయడం జరిగింది అదే మాదిరిగా మండల వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా అమ్మవారు ప్రతిరోజూ వేర్వేరు అవతారాల్లో దర్శనం ఇస్తూ భక్తులను కటాక్షిస్తున్నారు. అందులో భాగంగా ఈ రోజు అమ్మవారు అన్నపూర్ణ దేవి రూపంలో దర్శనం ఇచ్చారు.అన్నపూర్ణ దేవి అన్నదాత, అక్షయపాత్ర స్వరూపిణిగా ప్రసిద్ధి చెందారు. భక్తులకు ఆకలి లేకుండా కడుపు నింపే తల్లి అన్నపూర్ణగా శాస్త్రాలు వర్ణిస్తున్నాయి. "ఆహారం అనేది అన్నదానం రూపంలో పరమ దానం" అని భావించే భారతీయ సంప్రదాయంలో అమ్మవారు అన్నపూర్ణ అవతారం విశిష్టమైనది. భక్తులు దేవిని దర్శించుకొని తమ కుటుంబంలో ఎప్పుడూ అన్నపూర్ణ కటాక్షం ఉండాలని ప్రార్థించారు.మండలంలోని అన్ని గ్రామాల భక్తులు ఈ సందర్భంలో పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకారాలతో అమ్మవారిని ఆరాధించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తుల నినాదాలతో మారుమ్రోగింది. మహిళలు ప్రత్యేకంగా దీపారాధన చేసి, నవరాత్రి వ్రతాలను ఆచరించారు. చిన్నపిల్లలు, యువత సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవానికి ఆకర్షణగా నిలిచారు. ఇక ముబారస్ పూర్ గ్రామంలో గత 19 ఏళ్లుగా నిరంతరాయంగా నవరాత్రి ఉత్సవాలను స్థానికులు నిర్వహించడం విశేషం. గ్రామస్తులు సమిష్టిగా ఏర్పాట్లు చేసి ప్రతీ ఏడాది అమ్మవారిని భక్తులకు వైభవంగా దర్శనం కల్పిస్తున్నారు. ఈసారి కూడా గ్రామస్థుల సహకారంతో ఉత్సవాలు మహోత్సాహంగా జరుగుతున్నాయి. అన్నపూర్ణ దేవి అవతారం ద్వారా ఆహారం విలువ, సమాజంలో దాని పంచిపెట్టే సంస్కృతి, భక్తి విశ్వాసాల ప్రాధాన్యం మరింతగా ప్రతిఫలించిందని పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండపాల నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# దేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

**మనోహరబాద్ (ప్రజాస్వరం ) :** మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శ్రీశ్రీశ్రీ కాలకంటి వనదుర్గ బంగారమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన నవరాత్రి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజల్లో పాల్గొంటున్నారు. నిత్య అన్నదాన కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు పురం మహేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరబోయిన గోపాల్ ముదిరాజ్, కలకల్ మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రాజు యాదవ్, దండు రమేష్ ముదిరాజ్ లు బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఎర్రోళ్ల కృష్ణ, బజరంగ్ దళ్ నాయకులు బీరక్క. గోపాల్ ముదిరాజ్ లతోపాటు అమ్మ వారి మలాదరణ మాటలు కాంగ్రెస్ నాయకులు జన్నోజి నరసింహ చారి, కొండాపూర్ సత్యనారాయణ, నేతికుంట విద్యాసాగర్ లతోపాటు పలువురు మాలధారణ మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింజేశారు.













EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336, **EDITOR : PURAM MAHESHWAR.** RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999